చిన్నకథ

# బుల్లి బిర్లా


బొమ్మ: రాజశేఖర్

చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో జీతాలు ఇచ్చే రోజు ఆఫీసు బయట చీరలు, కంబళ్లు, స్వీట్స్, పెర్‌ఫ్యూమ్స్, ఇతర ఫేన్సీ వస్తువులు అమ్మే అనేక మంది చిల్లర వ్యాపారస్తులు పోగవుతారు. వీరే కాక చందాల కోసం వచ్చే బీదవారు కూడా తక్కువేం కాదు.

ఆ రోజు జీతాల రోజు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే శ్రీకర్ సీట్ దగ్గరకి ఓ పదహారేళ్ల కుర్రాడు వచ్చి అతనికి నమస్కారం చేసాడు. శ్రీకర్ అతన్ని చూసి చెప్పాడు.

''ఓ అరగంట ఆగు. ఇంకా జీతం తీసుకోలేదు.''

అరగంట తర్వాత జీతం ముట్టాక శ్రీకర్ అతనికి నూట డబ్బై అయిదు రూపాయలు ఇచ్చి పంపాడు. ఇది గమనించిన శ్రీకర్ కొలీగ్ అడిగాడు.

''ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఏదైనా కొన్నావా?''

''అవును. సైకిల్ కొన్నాను.''

''అదేమిటి? నువ్వు స్కూటర్ మీద కదా వచ్చేది? మరి సైకిల్‌ని ఎందుకు కొన్నావు?''

''నాకే కొన్నారండి. నేను స్కూలుకి వెళ్లడానికి సార్ ఇన్‌స్టాల్‌మెంట్‌లో కొనిచ్చారు.'' ఆ కుర్రాడు చెప్పాడు.

అతనెళ్లాక శ్రీకర్‌తో చెప్పాడు కొలీగ్.

''చూడు బ్రదర్. మనం బిల్ గేట్స్ కాదు, బిర్లాలం అంతకంటే కాదు. మనకి రేపు అవసరం అయితే ఇచ్చేవాడుండడు. మన స్థాయి సంపాదనగలవారు దానాలు చేయకపోవడం మంచిది.'' శ్రీకర్ బదులుగా నవ్వాడు కాని సమాధానం చెప్పలేదు.

ఏమిటలా నవ్వావ్?''

''ఆర్గ్యుమెంట్ ఎందుకని.''

''చెప్పు. చెప్పు. వింటాను కాని ఆర్గ్యూ చేయనని ప్రామిస్.'' హామీ ఇచ్చాడు కొలీగ్.

''ఇతరులకి సహాయం చేయడానికి కోట్ల డాలర్లతో బీదలకి పెద్ద ఫండ్ ఏర్పాటు చేసిన బిల్ గేట్స్, కోట్లాది రూపాయలతో కొండల మీద ఆలయాలు కట్టించే బిర్లానో అవాల్సిన అవసరం లేదు. వాళ్లే ఇందుకు అర్హులు అనుకోవడం అవివేకం. నేను వైజాగ్‌లో చదువుకునే రోజుల్లో కె.జి.హెచ్‌లో యు.డి.సిగా కౌసల్య అనే ఆమె పని చేసేది. ఆవిడ గురించి తర్వాత ఓ దినపత్రిక ఆదివారం అనుబంధంలో చదివితే కాని ఇప్పుడు నేను చెప్పబోయేది తెలీదు. ఆవిడ తన జీవిత కాలంలో సంపాదించిన జీతంలోంచి పది శాతం బీదవాళ్ల అవసరాలకే ఖర్చు చేసింది. స్కూలుకి వెళ్లడానికి యూనిఫాం లేని బీద విద్యార్థికి, ఇంటర్వ్యూకి చెప్పులు లేని నిరుద్యోగికి, ఓ పాత సైకిలుకి ఓ కొత్త టైరు, నిత్యం వాడాల్సిన డయాబెటిస్ మందు ఆ జబ్బుతో బాధ పడే బీద వాడికి ఇలా ఆవిడ తన జీవిత కాలంలో కొన్ని వందల మందికి నాలుగు లక్షల పైగానే ఖర్చు చేసి, వారి జీవితాల్లోని చీకట్లని తొలగించి చిన్నపాటి వెలుగుని ఇవ్వగలిగింది. బిల్ గేట్స్, బిర్లాలకి వాళ్లని వదిలేయలేదు. వదిలేసినా వాళ్లిద్దరి నించీ వారికి ఎలాంటి సహాయం అందేది కాదు. మనలాంటి వారు దేశంలో ఎక్కువ. మనలోని ప్రతీవారు తమ స్థాయిలో ఎంతో కొంత బీదలకి సహాయం చేయాలన్న నీతిని నేను ఆవిడ నించి అనుభవ పూర్వకంగా నేర్చుకున్నాను.''

''అనుభవ పూర్వకంగానా? నీకు ఆవిడతో పరిచయం ఉందా?'' ప్రశ్నించాడు కొలీగ్.

''కౌసల్యే నాకానాడు కాలేజీ ఫీజ్ కట్టింది. హార్బర్‌లో పని చేసే మరో మంచి వ్యక్తి నరసింహారావు నాకు పుస్తకాలు, మంత్లీ మీల్స్ టికెట్స్ కూడా కొని పెట్టేవాడు. వారి సాయం లేకపోతే నేను ఏ పెట్రోల్ బంక్‌లో కార్మికుడిగానో, బట్టల కొట్టులో సేల్స్‌మెన్‌గానో పని చేస్తూండే వాడిని.''

అతని కొలీగ్ ఆశ్చర్యంగా చూసాడు.

''నెల నెలా నేను జీతం రోజు వాళ్ల దగ్గరకి వెళ్లి ఆ డబ్బు తీసుకునేవాడ్ని. లేదా ఖర్చయిపోతుందనేవారు. ఇదే పాలసీని నేనూ అనుసరిస్తున్నాను.''

అతని కొలీగ్ కొద్ది సేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత చెప్పాడు.

''నువ్వు చెప్పిన దాంట్లో పాయింట్ ఉంది. నా మనసుని శోధించి చూస్తే, నేను ఇందాక అన్న మాటలు నాలోని స్వార్థాన్ని చంపుకోలేక నన్ను నేను సమర్థించుకునేందుకు మాట్లాడినవే అన్న సత్యం నాకు బోధ పడింది. ఇచ్చే మనసున్న వాళ్లంతా బుల్లి బిర్లాలే''

''ఆ కుర్రాడి తమ్ముడికి థైరాయిడ్ సమస్య. రోజూ అయిదారు రూపాయల మాత్రలు జీవితాంతం వాడాలి. నువ్వు సరేనంటే అతన్ని పిలుస్తాను.'' చెప్పాడు శ్రీకర్.

''సరే నా మనసు వీళ్ల స్వార్థంలో చిక్కుకోక ముందే పిలు.''

శ్రీకర్ తన ఆఫీసు కిటికీ దగ్గరకి వెళ్లి కిందకి చూస్తూ గట్టిగా పిలిచాడు.

''శీనూ! ఓ సారి మళ్లీ పైకి రా.''

– ఎమ్వీకె